క్లుప్తంగా

అన్నపూర్ణ పథకానికి రూ.10వేలు విరాళం



విరాళం అందచేస్తున్న భానుమతి

శ్రీకాకుళం కల్చరల్: రిమ్స్‌లో సత్యసాయిసేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సత్యసాయి అన్నపూర్ణ నిత్యాన్నదాన పథకానికి శనివారం హయాతినగరం భజన మండలి సభ్యులు పైడిశెట్టి భానుమతి తన భర్త ధర్మారావు జ్ఞాపకార్థం రూ.10 వేలు విరాళం అందించారు. ఈ మొత్తంతో ఆస్పత్రికి వచ్చిన రోగుల సహాయకులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పథకం కార్యదర్శి కిల్లాన ఫల్గుణరావు, నవీన్, కె.వెంకటరావు, సుధాకరరావు, భాస్కరరావు, భాను, కృష్ణారావు, ఇందు, ఉషారాణి, బుచ్చమ్మ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో వెంకన్న



వేంకటేశ్వరస్వామి

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని చిన్నబజారులో వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు శ్రీనివాసాచార్యులు స్వామివారిని తులసి మాలలు, పూలమాలతో అందంగా అలంకరించారు. ఈ సందర్భంగా భక్తుల గోత్ర నామాలతో అర్చనలు చేశారు. కార్యక్రమంలో ఈఓ సర్వేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.

హెల్మెట్ వినియోగం తప్పనిసరి



అవగాహన కల్పిస్తున్న ఎస్సై సత్యనారాయణ

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రమాదాల సమయంలో ప్రాణాలకు రక్షణగా నిలిచే హెల్మెట్‌ను తప్పనిసరిగా వినియోగించాలని ఎచ్చెర్ల ఎస్సై వి.సత్యనారాయణ సూచించారు. చిలకపాలెం, కుశాలపురం బైపాస్ కూడళ్లలో హెల్మెట్ వినియోగం, ప్రయోజనాలపై ద్విచక్ర వాహన చోదకులకు శనివారం అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాల్లో తలకు గాయాలు కావటం వల్లే వాహన చోదకులు మృతి చెందుతున్నారని, తలకు రక్షణగా హెల్మెట్ వినియోగించాలని సూచించారు. పోలీసులు తనిఖీలు చేస్తారనే భయంతో కాకుండా ప్రాణ రక్షణ కోసం హెల్మెట్ వినియోగించాలన్నారు.

నేలతల్లిని కాపాడుకుందాం



మాట్లాడుతున్న పీడీ చిట్టిరాజు

ఎచ్చెర్ల: మేరీ మట్టి, మేరా దేశ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డ్వామా పీడీ చిట్టిరాజు కోరారు. శనివారం ఇబ్రహీంబాద్ గ్రామానికి విచ్చేసిన ఆయన మేరీమట్టి, మేరా దేశ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్య్ర యోధులు మన కోసం రక్తం చిందించి కాపాడిన నేలను మనం కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. శరీరంలోని ప్రతి అణువు మాతృ భూమి కోసం పనిచేయాలన్నారు. ఇదే సమరయోధులకు మనం అర్పించే నివాళి అని పేర్కొన్నారు. స్వచ్ఛమైన నీరు, గాలి, సారవంతమైన నేలను భావితరాలకు అందించాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో శోభారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

9న విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వెనుక ఉన్న విద్యుత్ శాఖ కార్యాలయంలో ఈ నెల 9న విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు శ్రీకాకుళం రూరల్ సబ్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సత్తారు బయ్యన్నాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిర్యాదుల ఫోరం చైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి బి.సత్యనారాయణ అధ్యక్షతన గ్రీవెన్స్ నిర్వహణ ఉంటుందని పేర్కొన్నారు. రూరల్ సబ్ డివిజన్‌లోని వినియోగదారులు సమస్యలు తెలియజేయవచ్చన్నారు.

పంట కోత ప్రయోగాలపై శిక్షణ

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం తహశీల్దార్ కార్యాలయంలో శనివారం వీఏఏలకు, వీఆర్‌ఓలకు పంటకోత ప్రయోగాలపై ఒక్కరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి ఉషాకుమారి మాట్లాడుతూ గ్రామాన్ని యూనిట్‌గా తీసుకోవాలన్నారు. నాలుగు పంటకోత ప్రయోగాలను 250 ఎకరాలుగా ఒక యూనిట్‌గా తీసుకోవాలన్నారు. మండలంలో 108 యూనిట్లలో పంటకోత ప్రయోగాలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓ ఎరుకనాయుడు, సుజాత తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



శ్రీకాకుళం అర్బన్: గుజరాతీపేటలో తల్లిపాల వారోత్సవాలు

శ్రీకాకుళం అర్బన్: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందని వక్తలు పేర్కొన్నారు. గుజరాతీపేట సెక్టార్ పరిధిలోని తోటవీధి అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. అప్పుడే పుట్టిన బిడ్డకు 6 నెలలు నిండినంత వరకూ తల్లిపాలు పట్టించాలని, ఏ ఇతర ద్రవ పదార్థాలు పట్టరాదని తెలిపారు. తల్లి పాలు పట్టడం వల్ల తల్లికి, బిడ్డకు శ్రేయస్కరమన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.రమ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

రణస్థలం: వైఎస్సార్ సంపూర్ణ పోషణ పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని రణస్థలం జెడ్పీటీసీ టొంపల సీతారాం అన్నారు. ఎర్రవరం గ్రామ సచివాలయం వద్ద బాలింతలకు, గర్భిణులకు టేక్ హోమ్ రేషన్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలు, గుడ్లు, బెల్లం, వేరుశెనగ చిక్కీలు, రాగి పిండి, గోధుమ పిండి, ఎండు ఖర్జూరం వంటి సరుకుల్లో పోషకాలు మెండుగా ఉంటాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జగనన్న గ్రామ సచివాలయాల మండల ఇన్‌చార్జి చిల్ల వెంకటరెడ్డి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

లావేరు: గర్భిణులకు, బాలింతలకు ప్రభుత్వం అందజేస్తున్న వైఎస్సార్ పోషణ కిట్లను సద్వినియోగం చేసుకోవాలని వెంకటాపురం పంచాయతీ సర్పంచ్ బొంతు అరుణ ఎల్లంనాయుడు అన్నారు. వెంకటాపురం అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం వైఎస్సార్ పోషణ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు వావిళ్ల రామారావు, పిట్ట అప్పన్న, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం.దుర్గ, వై.కనకదుర్గ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల క్యాంపస్: ఫరీదుపేట అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ఎంపీపీ మొదలవలస చిరంజీవి వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేశారు. అనంతరం తల్లి పాల ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొత్తకోట పూర్ణచంద్రరావు, నాయకులు మాడుగుల మురళీధర్‌బాబా, బెండు రామారావు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జి.సిగడాం: పుట్టిన బిడ్డకు తల్లిపాలే శ్రీరామరక్షణ అని సేతుభీమవరం పంచాయతీ సర్పంచ్ తొత్తడి రామారావు అన్నారు. గంగన్నదొరపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లి పాలు వారోత్సవాల సందర్భంగా పౌష్టికాహార ప్రదర్శన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి, నాయకులు ఎం.కనకరావు, కె.లక్ష్మంనాయుడు, అంగన్‌వాడీ కార్యకర్తలు కోరగంజి యశోద, కె.రాధ, కె.ఎస్.సుబ్బలక్ష్మి, ఏఎన్‌ఎం కె.జయలక్ష్మి, ఆశా కార్యకర్త పి.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లి పాలు అమృతంలా పని చేస్తాయని శ్రీకాకుళం అర్బన్ ప్రాజెక్ట్ అధికారి బి.శోభారాణి అన్నారు. నగరంలోని కృష్ణాపార్క్ సెక్టార్ పరిధిలోని కత్తిరి వీధి–1 అంగన్‌వాడీ కేంద్రం వద్ద శనివారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు పి.సీతామహాలక్ష్మి, వార్డు ఇన్‌చార్జి రఫీ, ఎంఎస్‌కే రత్నకుమారి, జరీనా, పర్వీనాబేగం, రజీనాబేగం, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



రణస్థలం: ఎర్రవరంలో పోషణ కిట్లు అందజేస్తున్న జెడ్పీటీసీ సీతారాం



లావేరు: వెంకటాపురంలో పోషణ కిట్లు అందజేస్తున్న నాయకులు



ఎచ్చెర్ల క్యాంపస్: ఫరీదుపేటలో కిట్లు అందజేస్తున్న ఎంపీపీ చిరంజీవి



జి.సిగడాం: గంగన్నదొరపాలెంలో పౌష్టికాహారం ప్రదర్శన



శ్రీకాకుళం అర్బన్: తల్లిపాల వారోత్సవాల ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అర్హతే ప్రామాణికంగా పథకాలు



ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

- గడపగడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. తోటపాలెం గ్రామ సచివాలయం పరిధిలో అఖింఖాన్‌పేట, పెయిలవానిపేట గ్రామాల్లో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 99 శాతం అర్హులకు ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని, అందని ఒక్క శాతం సమస్యలు జగనన్న సురక్షలో పరిష్కరించి అందజేస్తున్నట్లు చెప్పారు. అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలు అందజేస్తున్నట్లు తెలిపారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందజేయటంలో కీలకంగా వ్యవహరిస్తున్న వలంటీర్ వ్యవస్థపై ప్రతి పక్షాలు చేస్తున్న ఆరోపణలు వారి అభద్రతా భావానికి నిదర్శనమని చెప్పారు. ప్రతిపక్షాలు ఎన్నికుట్రలు పన్నినా రానున్నది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. పేదరికం నిర్మూలనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఎచ్చెర్ల మండలంలో 66 రోజులు 27600 గడపలకు వెళ్లినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ మొదలవలస చిరంజీవి, పీఏసీఎస్ అధ్యక్షుడు సనపల నారాయణరావు, జేసీఎస్ ఇన్‌చార్జి మూగి శ్రీరాములు, కార్పొరేషన్ డైరెక్టర్లు కళ్లేపల్లి తిరుపతిరావు, నక్క కృష్ణమూర్తి, వ్యవసాయాధికారి సురేష్, పీఆర్‌ఏఈ సూర్యచంద్ర, వెలుగు ఏపీఎం రామ్మూర్తి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దివ్య, హౌసింగ్ ఏఈ రాజేంద్రప్రసాద్, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు బొడ్డేపల్లి సుధాకర్‌రావు, నాయకులు మంత్రి మోహన్‌రావు, కిశోర్, గొర్లె సూర్యనారాయణ, నక్క శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పార్లమెంట్‌ను సందర్శించిన వర్సిటీ విద్యార్థిని



రజినిని అభినందిస్తున్న ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ రాజశేఖర్‌రావు, హెచ్‌ఓడీ రామకృష్ణ

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో మూడో సంవత్సరం సీఎస్సీ ఇంజినీరింగ్ చదువుతున్న బమ్మిడి రజిని ఆగస్టు 1న భారత పార్లమెంట్ భవనాన్ని సందర్శించారు. ఈమెది నందిగాం మండలం ఆనందపురం. కేంద్ర యువజన సర్వీసుల శాఖ నోటిఫికేషన్ మేరకు దరఖాస్తు చేసుకోగా, ఆల్ ఇండియా యూనివర్సిటీ యోగా పోటీల్లో ప్రతిభ, హరియాణాలో జరిగిన జాతీయ సమైక్యతా శిబిరంలో భాగస్వామ్యం, జాతీయ సేవా పథకం వలంటీర్‌గా అందించిన సేవలు పరిగణలోకి తీసుకొని ప్రభుత్వ ఖర్చులతో పార్లమెంట్ సందర్శనకు అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా రజిని మాట్లాడుతూ పార్లమెంట్ సమావేశాలు ప్రత్యక్షంగా చూడటం, లైబ్రరీ సందర్శన ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చింతాడ రాజశేఖర్‌రావు, హెచ్‌ఓడీ రామకృష్ణ శనివారం అభినందించారు.

యువకుడు బలవన్మరణం



శ్రీనివాసరావు(ఫైల్)

గోపాలపట్నం (విశాఖపశ్చిమ): విశాఖపట్నం జిల్లా బుచ్చిరాజుపాలెం వేణుగోపాలస్వామి ఆలయం సమీపంలో జియో ఫైబర్ పనుల సబ్ కాంట్రాక్టర్ రెడ్డి శ్రీనివాసరావు(26) బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఎయిర్‌పోర్టు పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రణస్థలం సమీపంలోని పతివాడపాలెంకు చెందిన శ్రీనివాసరావు మూడు నెలలుగా ఇక్కడ అద్దెకు ఉంటున్నాడు.. స్వగ్రామం నుంచి శుక్రవారం రాత్రి తిరిగి వచ్చాడు. ఇంట్లో ఒక్కడే ఉన్నాడు. తన వద్ద పని చేసే యువకులకు ఫోన్ చేసి నేను వచ్చేశాను.. మీరు ఈ రాత్రికే తొందరగా రావాలని ఫోన్‌లో చెప్పాడు. రాత్రి 12 గంటల సమయంలో వచ్చిన యువకులు తలుపు కొట్టినా తీయకపోవడంతో ఫోన్ చేశారు. అయినా స్పందించక పోవడంతో నిద్రలో ఉన్నారనుకుని మేడపై నిద్రించారు. ఉదయాన్నే లేచి మళ్లీ తలుపు కొట్టినా తీయలేదు. దీంతో ఇంటి యజమానికి సమాచారమిచ్చారు. ఇంటి యజమాని వెనుక వైపు ఉన్న కిటికీ తలుపులు విరిచి చూసే సరికి శ్లాబ్ హుక్‌కు తాడుతో ఉరి వేసుకుని కనిపించాడు. వెంటనే పోలీసులకు కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. ఎయిర్‌పోర్టు పోలీసులు చేరుకుని వివరాలు సేకరించారు. ఘటనా స్థలంలో బీరు సీసాలు, తినుబండారాలు ఉన్నాయి. మద్యం మత్తులో ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. ఇతనికి తల్లి, తండ్రి, ఇద్దరు అక్కలు ఉన్నారు. మృతికి గల కారణాలు తెలియరాలేదు. తండ్రి రెడ్డి సత్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టారు.

పరిపాలన అధికారిగా బాధ్యతల స్వీకరణ



వెంకట సత్య రామ్మోహన్

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండల పరిషత్ పరిపాలన అధికారిగా పూజారి వెంకట సత్య రామ్మోహన్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం పనిచేస్తున్న కుమార్ పట్నాయక్ బదిలీ అయ్యారు. ఈ సందర్భంగాను ఏఓను ఎంపీపీడీ రమాదేవి, సిబ్బంది అభినందించారు.

అనురాగ నిలయానికి రూ.25వేలు విరాళం



దాతకు ధ్రువపత్రాన్ని అందిస్తున్న చైర్మన్

శ్రీకాకుళం కల్చరల్: రెడ్‌క్రాస్ అనుబంధ సంస్థ శాంతా కళ్యాణ్ అనురాగ నిలయానికి పట్టణానికి చెందిన రోణంకి వెంకటలక్ష్మి మానవతా దృక్పథకంతో రూ.25 వేలు విరాళంగా శనివారం అందించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, చిన్మయరావు, శిల్లా మణి, బి.బాబ్జి, పి.వాసు, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

వసతి గృహంలో సౌకర్యాలపై ఆరా

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు శనివారం శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా కళాశాల ప్రాంగణంలో ఉన్న బీసీ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్ వసతి గృహాలను సందర్శించారు. భోజన, వసతి సౌకర్యాలపై ఆరా తీశారు. నిర్వాహకులు సూచనలందించారు. విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో న్యాయవాది ఇందిరా ప్రసాద్, వసతి గృహ సంక్షేమాధికారులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ నాయకుల నిరసన



ఎచ్చెర్ల క్యాంపస్: నిరసన తెలియజేస్తున్న ఏపీటీఎఫ్ ప్రతినిధులు



జి.సిగడాం: తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ఎచ్చెర్ల క్యాంపస్: డిమాండ్ల పరిష్కారం కోరుతూ ఏపీటీఎఫ్ నేతలు శనివారం ఎచ్చెర్ల తహశీల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. బదిలీలు, రేషనలైజేషన్, పదోన్నతులు వర్తించిన ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రద్దు చేసిన పాఠశాలల ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించలేదని పేర్కొన్నారు.యూనియన్ సభ్యులు మురళీధర్, నాగేంద్ర, ఆదినారాయణ, సింహాచలం పాల్గొన్నారు.

జి.సిగడాం: బదిలీ ఉపాధ్యాయులకు తక్షణమే జీతాలు చెల్లించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మజ్జి మదన్‌మోహన్, మండల శాఖ అధ్యక్షుడు కాయల రమేష్, కిల్లారి వెంకటరమణ, గౌరవాధ్యక్షుడు శీర రాము, జిల్లా కార్యదర్శి దుంగ వీరయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ ఎస్.నిర్మలకు వినతపత్రం అందించారు. కార్యక్రమంలో సంఘ నేతలు పిట్టా అప్పారావు, శ్రీరామదత్త, ఉమామహేశ్వరరావు, శేఖర్, చంద్రరావు, గోవిందరావు, శ్రీనివాసరావు, మల్లేశ్వరరావు, బాలకృష్ణ, సురేష్, శ్రవన్‌కుమార్, కృష్ణ, రామారావు పాల్గొన్నారు.

సీఆర్‌పీలు ఇకపై సీఆర్‌ఎంటీలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో-2 మురళీకృష్ణారావు

లావేరు: ఇంతవరకూ ఉన్న సీఆర్‌పీ వ్యవస్థను ప్రభుత్వం రద్దు చేసి సీఆర్‌ఎంటీల వ్యవస్థను తీసుకొచ్చినటుల్ల మండల విద్యాశాఖాధికారులు ఎల్.ఈశ్వరరావు, ఎం.మురళీకృష్ణారావు అన్నారు. లావేరు ఎంఆర్‌సీ కార్యాలయంలో శనివారం సీఆర్‌ఎంటీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంతవరకూ సీఆర్‌పీ వ్యవస్థ స్కూల్ కాంప్లెక్సు చైర్మన్ పరిధిలో పనిచేసేదని, ఇప్పుడు సీఆర్‌ఎంటీ వ్యవస్థ మండల విద్యాశాఖ పరిధిలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఎప్పటికప్పుడు ప్రభుత్వ పాఠశాలల రిపోర్టులను ఎంఈవో కార్యాలయానికి అందజేయాలన్నారు. సమావేశంలో సీఆర్‌ఎంటీలు టి.లక్ష్మణరావు, జి.సూర్యనారాయణ, వి.గోవిందరావు, కె.పద్మావతి, పి.మహేశ్వరం, ఎం.రమేష్, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

టీకాలతో లంపీస్కిన్ నివారణ



టీకాలు వేస్తున్న దృశ్యం

గార: ముందస్తు టీకాల ద్వారా పశువుల్లో లంపీస్కిన్‌ను ఎదుర్కోవచ్చని రాష్ట్ర అగ్రిమిషన్ సభ్యుడు, ఎంపీపీ గొండు రఘురామ్ అన్నారు. శనివారం అంపోలులో లంపీస్కిన్ వ్యాధి నివారణకు ముందస్తు నివారణ టీకాలు వేసే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లంపీస్కిన్ నివారణకు ప్రభుత్వం జిల్లాలో రూ.40 లక్షల మేర ఖర్చు చేస్తోందన్నారు. పశుసంవర్ధక శాఖ ఏడీ గొలివి రాజశేఖర్ మాట్లాడుతూ జిల్లా అంతటా రైతు భరోసా కేంద్రాల పరిధిలో నెల రోజుల పాటు ఉచిత వ్యాక్సినేషన్ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారులు సుభాష్ చంద్రబోస్, మోహిని, శేఖర్, పాలిటెక్నిక్ విద్యార్థులు, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

సర్వకళల సమాహారం హరికథ



హరికథా గానం చేస్తున్న వాణిశ్రీ



ఆదిభట్ల నారాయణదాసు విగ్రహానికి పూలమాల వేస్తున్న కళాకారులు

శ్రీకాకుళం కల్చరల్: అన్నికళల సమాహారం హరికథ అని గాయత్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు అన్నారు. పూజీ కళామందిరంలో శనివారం శ్రీకాకుళ రంగస్థల కళాకారుల నెలవారీ సాంస్కృతిక విభాగం 286వ నెల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రామచంద్రాపురానికి చెందిన శిఖామణి భాగవతారిణిచే 'సీతారామ కల్యాణం' హరికథాగానం జరిగింది. విజయనగరానికి చెందిన ముదుపాక ఈశ్వరమ్మ వయొలిన్‌పై, మెళియాపుట్టికి చెందిన రాయల మోహనరావు మృదంగంపై వాద్య సహకారం అందించారు. అంతకుముందు ఆదిభట్ల నారాయణదాసు విగ్రహానికి పూలమాల వేశారు. సమాఖ్య అధ్యక్షుడు చిట్టి వెంకటరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆమదాలవలస కళాకారుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి బగాది వెంకటరావు, మహతి సాంస్కృతిక సేవా సమితి కన్వీనర్ డాక్టర్ ఇ.ఎస్.సంపత్‌కుమార్, ఎల్.రామలింగస్వామి, పన్నాల నర్సింహమూర్తి, బి.రామచంద్రదేవ్, పొట్నూరు వెంకటరావు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా పథకాల మంజూరు



పథకాల బులెటిన్‌ను అందిస్తున్న ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కుల, మత, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీయేనని పార్టీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని 32వ డివిజన్‌లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవరత్నాలు అమలు ద్వారా సమ సమాజ స్థాపన సాధ్యపడుతోందన్నారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల పేరిట దోపిడీని ప్రోత్సహించి రాష్ట్రాన్ని అవినీతిమయంగా మార్చారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలకు పూర్వ విద్యార్థుల వితరణ



ప్రిన్సిపాల్‌కు చెక్ అందజేస్తున్న మూర్తి, చంద్రశేఖర్

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో 1978–81 బ్యాచ్‌లో చదువుకున్న విద్యార్థులు కళాశాలకు బాసటగా నిలిచారు. నాటి పూర్వ విద్యార్థులందరూ కలిసి కళాశాల అభివృద్ధికి తమ వంతుగా సహకరిస్తున్నారు. కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం కార్యదర్శి, విశ్రాంత పాలిటెక్నిక్ కాలేజ్ లెక్చరర్ వీవీఆర్ఎస్ మూర్తి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగి చంద్రశేఖర్, నైజీరియాలో పనిచేసిన రిటైర్డ్ జనరల్ మేనేజర్ సువ్వారి చంద్రశేఖర్ వారి బ్యాచ్ తరఫున రూ.78 వేలను సమకూర్చారు. శనివారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖకు ఈ చెక్ అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎం.వి.ఎస్ సత్యనారాయణ, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఆర్.హరిత, కళాశాల పూర్వ విద్యార్థుల సంఘ సభ్యులు, జంతుశాస్త్ర అధ్యాపకులు శివాల రవిబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రహదారి సౌకర్యం కల్పించాలని వినతి

జి.సిగడాం: మండలంలోని చంద్రయ్యపేట శ్మశానానికి రహదారి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుతూ గ్రామానికి చెందిన పిట్టా భాస్కరరావు శనివారం తహసీల్దార్ పప్పల వేణుగోపాలరావుకు వినతిపత్రం అందించారు. వర్షం పడితే పొలం గట్లపైనే మృతదేహాన్ని తీసుకెళ్లాల్సి వస్తోందన్నారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజలు సహకరిస్తే శరవేగంతో సర్వే చేస్తామన్నారు. ఆర్ఐ రామచంద్రరావు, బొల్లా జనార్దనరావు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు

శ్రీకాకుళం క్రైమ్ : ద్విచక్రవాహనం ఢీకొనడం వ్యక్తికి గాయాలయ్యాయని శ్రీకాకుళం ట్రాఫిక్ ఎస్ఐ ఎస్.సోమశేఖర్ తెలిపారు. 80 ఫీట్ రోడ్డు దరి వాంబేకాలనీ నారాయణ స్కూలు సమీపంలో టీటైమ్ షాపునకు భారత్ గ్యాస్ కళాసీ రాజాన అప్పన్న గ్యాస్ సిలిండర్ తీసుకెళ్తుండగా మిల్లు జంక్షన్ నుంచి వస్తున్న ద్విచక్ర వాహనచోదకుడు ఢీకొట్టాడు. ఈ ఘటనలో అప్పన్నకు గాయాలు కావడంతో కిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.